


# పండుగ

* కలవకొలను సదానంద

## ఆనంద మహార్ణవం!

ఎలా వుంటుందది?

నెమరు వేసుకోవటమంత తేలిక కాదు, దాన్ని మాటల్లో పెట్టటం!

ప్రకృతి తనంతట తాను నోరువిప్పి పలికితే వినవలసిందే తప్ప, ఆ శాంతి సాగర విహార కథనం మానవ మాత్రుడినైన నాకు చేతనయ్యే పనికాదు.

వాగ్దేవి ప్రసన్నురాలైతేనే కానీ అలాంటి అద్భుత వాక్చిత్రం రూపుదిద్దు కోదు.

రంగులై రేఖలై వెలుగు నీడలై, అక్షరాలు కదలాడనీ!

స్వర జతులై శ్రుతి లయలై, అక్షరాలు రవళించనీ!

మన నాలుకల మీద నిలవలేక జారిపోయే అమృతోపమానమైన ఆ శబ్దాలను, మహనీయమైన ఆ మృదు మధుర స్వనాలను అక్షర బద్ధం చేయటానికి లోకంలో ఏ లిపిని ఆశ్రయించాలి నేను?

హృదయ స్పందనలోని స్థాయీ భేదాన్ని, రక్త ప్రసరణలోని ఎగుడు దిగుళ్ళను, మెదడు కడలిలో లేచిపడే ఆటు పోటులను సమతలంలో సమతౌల్యంలో నిలిపి, ప్రాణానికి కాసేపు సేదతీర్చి స్వస్థత చేకూర్చే ఆ గంధర్వ గానాన్ని దేనితో ఉపమించను?

దేవాలయ ప్రాకారంలోపల ధ్వజస్తంభం చివర గాలికి కదలాడే చిరుగంటల సవ్వడులందామా?

లయబద్ధంగా మోగే కాలింగ్ బెల్ కొంటె మోతలందామా?

కన్నె పిల్లలు కొందరు తానమాడటానికి చెరువులో దిగినప్పుడు ఒళ్ళు చక్కిలిగింత లెత్తిన గంగమ్మ పకపకలందామా?

వేకువ జామున పల్లె చివరి నుంచి వినిపించే జంగందేవర చేతిలోని ఢమరుక నాదమందామా?... తంత్రీ వాదన మందామా?...నర్తన బాలల కాలి అందెల రవళి అందామా?...

ఈ ఉపమానాలు సరిపోతాయా?

చిత్ర విచిత్రమైన గోరింకల కూతల్ని-ఇవన్నీ యధా తథంగా అనుకరించగలవా?

అచ్చం గోరింకలా పలకాలంటే, గోరింకగా పుట్టాల్సిందేనేమో!

కిర్ కిర్-కిర్ కిర్-కిర్
క్రీచ్-క్రీచ్
క్యో
కీర్-కీర్-కీర్
కివీక్-కివీక్
క్యాక్యా-క్యాక్యా
క్యూ-క్యూ-క్యూ

వంద గోరింకలు ఒక్కసారిగా కూస్తుంటే కర్ణపేయంగా వుంటుందేకానీ, విసుగన్నదే వుండదు.

సుస్వర యుక్తంగా, లయబద్ధంగా, మంద్ర స్థాయిలో నిర్విరామంగా వినిపించే ఆ తీయని పలుకులు ఎంతసేపు విన్నా ఇంకా వినాలనే అనిపిస్తుంది.

గోరింకల ఈ నృత్య గాన సప్తాహానికి రావిచెట్టే సభామండపం!

ఈ సందడీ ఈ చైతన్యం ఈ తమాషా ఈ ఈల ఈ హేల ఈ అందమైన గోల-ఏడాదిలో వారం రోజులు మాత్రమే!

ప్రకృతి రంగు వెలిసిపోయిన పాత ముస్తాబుల్ని, వొలిచి గాలి కొదిలేసి కొత్త ముస్తాబుల్ని వెతుక్కునే యుగ సంధిలో-

మళ్ళీ శృంగార మాధుర్యాన్ని చవి చూడటానికి సిద్ధపడే ముందు కడుపు బరువు దించుకోటానికి రావిచెట్టు ప్రసవ వేదన పడే చైత్రారంభ దినాలలో-

రానున్న వలరాచ జాతరకు స్వాగత సన్నాహమా అన్నట్టు దర్శనమిచ్చేదే ఈ గోరింకల జాతర!

మూడంకణాల పూరిల్లు
అదే మా పల్లెటూరి బడి
బడి పక్కనే-ఆకాశాన్ని నెత్తిన మోస్తున్నట్లున్న

పెద్ద రావిచెట్టు. చెట్టు కింద రచ్చబండ

ఉగాదికి ముందో వెనకో తొడిమలు ఊడిపోయే ఘడియలొస్తాయి. ఆ దశలో ఓ వారం రోజులపాటు ఊరి జనం ఎవరూ రచ్చబండ మీాద కూచోరు, కూచోలేరు. జడివానలా అనునిత్యం రాలిపడే పండుటాకులు, చితికిపోయిన ఎర్రటి రావిపళ్ళూ జానెడెత్తున వుంటాయి. పిట్టలు రెట్టలు వేస్తూనే వుంటాయి. రచ్చబండ మీాద, రచ్చబండ చుట్టూ పడి చితికిన రావిపళ్ళ తీపి వాసనల్లో మునిగి తేలుతూ ప్రతి అంగుళం మేరా చలి చీమలు తిరుగాడుతుంటాయి-తొలకరి వానలప్పుడు దూకుళ్ళతో దుక్కి దున్నే బక్క రైతన్నలకు మల్లే క,జ,చ,య,ర,శ,ష,స గుణింతాలు, ఈ శబ్దాల చిలికింతలతో మొలకెత్తే ద్విత్వాక్షరాలూ, సంయుక్తాక్షరాలూ వల్లె వేస్తుంటాయి.

వేసవి తొలి రోజులు ఒంటిపూట బడి:

ఉదయం బడికొస్తాను

మూడంకణాల యిల్లు పిల్లలందరికీ సరిపోదు. కొందర్ని లోపల కూచో బెడతాను. తూరుపు వైపు నుంచి బడి మీాదికి సాగిలబడే చింత చెట్ల చల్లని నీడలలో కొందర్ని కూచోబెడతాను. నేను కూడా బయటే కుర్చీ వేసుకుని, గోడవార నీడ ఎక్కడికి కదిలితే అక్కడికి కదులుతూ వుంటాము. పిల్లలకు ఏదో చెబుతుంటానుగానీ, గోరింకల కేరింతలు విరితూపుల్లా నన్ను కమ్ముకుంటాయి. తపోభంగం చెయ్యటానికొచ్చిన అప్సరోభామినుల్లా అవి నన్ను సమ్మోహింప జేస్తాయి.

క్కీర్! కిశ్ కిశ్ క్కీర్! కిశ్ కిశ్ క్కీర్!

ఆ ఆకర్షణా జాలాన్ని తెంచుకోవటం సాధ్యమా?

నా తల దానంతట అదే పైకి లేస్తుంది.

పత్తికాయల్లా విచ్చుకున్న కళ్ళు అనిమిషాలైపోతాయి.

ఏ కళా సంపూర్ణంగా అనుకరించలేని వాస్తవ సుందర దృశ్యం అది!

ఒక చేత ప్రకృతి తంత్రుల్ని మీాటుతూ, మరో చేత కనిపించని కుంచెలతో నీలాకాశపు తెరమీాద ఏకకాలంలో అనేక తళతళల్ని మిలమిలల్ని కదలికల్ని కలకలాన్ని ప్రవేశ పెడుతూ నిష్క్రమింప జేస్తూ, కాలపురుషుడు తాను అదృశ్యంగా వుండి చిత్రిక పట్టే నిరవధిక శబ్ద చలనచిత్ర కళా స్రవంతి అది!

నీలాకాశపు కాగితం మీాద-కదిలే బొమ్మలు.

బూడిద రంగులో రావిచెట్టు కొమ్మలు-శాఖోప శాఖలు

కొమ్మల నిండా ఆకులు-గలగల లాడుతూ!

పసరు పచ్చగా ముదురు టాకులు

పసుపు పచ్చగా పండుటాకులు

గోధుమ రంగులో ఎండుటాకులు

కొమ్మలే మెరుపు తీగలైనట్టు ఎన్నో రెమ్మలు, చిరు రెమ్మలు, చిరు చిరు రెమ్మలు!

చెట్టు కొమ్మల మీాద ఆరబెట్టిన గోగునార పోగుల్లా జడలు జడలుగా వున్న బారెడేసి మూరెడేసి

అద్భుతమైన దృశ్యాన్ని చూడ గలిగినప్పుడు 'నేత్రపర్వం' అంటాము. మహత్తర గానాన్ని విన్నప్పుడు 'శ్రవణపర్వం' అంటాము. ఈ రెండూ కలసిన పర్వాన్ని ఏమనాలి? నేత్రశ్రవణ పర్వం అనాలా?

రుతువుల రాణి వసంత రుతువు మంత్ర కవాటం తెరచినప్పుడు మనిషి మంత్రముగ్ధుడు కాక తప్పదు. అప్పుడు గోరింకల, చిలుకల అరుపుల్ని 'కూత' అనకూడదు. మంత్రాలనే అనాలి. ఆ మంత్రాల భాష మనుషులకు తెలీదుకానీ మనసులకు అర్థమవుతూనే వుంటోంది. అర్థంగాక ముందే ఆ మనసులు పులకించిపోతూనే వుంటాయి. ఆనందోత్సవం అది.

ఇంతకుముందు 'చిలకలు వాలిన చెట్టు'ను చూశాం. ఇక్కడ 'గోరింకలు వాలిన చెట్టు'ను చూస్తాం.

రెమ్మల నిండా ఒత్తుగా హత్తుకుని పగడాల సరాల్లా వేలాడుతున్న ఎర్రటి పళ్ళు. లక్షోప లక్షల రావిపళ్ళు.

పండగా-పబ్బమూ అన్నారు! ఇంత సందడికీ కారణం ఆ పళ్ళే!

అవన్నీ రాలిపడిపోయే దాకా రావిచెట్లో గోరింకల బ్యాండు మేళం ఆగదు.

చిరుగాలి రాపిడికి ఏరువాకల్లా గలగల పాడుతూ, నీరెండ తాకిడికి వెండి రేకుల్లా తళతళ లాడుతూ లాస్యక్రమం తప్పకుండా బృందనాట్యం చేస్తున్న వేలాది ఆకుల నడుమ వేలాడదీసిన తాటాకు విసనగర్రల్లా, పేక ముక్కల పేర్పుల్లా, గిర్రున తిరుగుతున్న కాగితపు చక్రాల్లా-చెట్టు నిండా గోరింకలు.

గాలి వీచినప్పుడు రాలే ఎండుటాకులు, గోరింకలు ఊగినప్పుడు ఊడిపడే పండుటాకులూ అలలు అలలుగా మెల మెల్లగా కిందికి తేలి వస్తుంటాయి. ఏటి వాలున సాగివచ్చే తెరచాప పడవల్లా!

గోరింకల ఉయ్యాలాటలలో పట్టుజారిన రావిపళ్ళు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకుంటూ భయంతో కేకలు వేసుకుంటూ టపటపా దూకేస్తుంటాయి.

కింది నుంచి పైకి చూస్తుంటే విశాల సాగరంలా ఆకాశం, దాని నడుమ ఓ చిన్న దీవిలా రావిచెట్టూ కనిపిస్తాయి.

రాజకన్యా స్వయంవరానికి తరలివచ్చే యువ రాజుల్లా విందు భోజనాలకు వచ్చి వాలే బంధు మిత్రుల్లా,

భూలోకపు వింతల్ని చూడటానికి గుంపు కట్టి వచ్చే గంధర్వ బాలికల్లా, ఎక్కడెక్కడి నుంచో ఎగిరొస్తుంటాయి గోరింకల తండాలు.

దూది పింజల్లా తేలియాడే తెల్ల మబ్బుల పందిళ్ళ కింద బొమ్మ విమానాలన్నట్లు చూడవేడుకగా ఎగురుతూ వొచ్చి రావిచెట్టు కొమ్మల్లో వాలుతుంటాయి.

అత్తగారింట మనుగుడుపుల ముచ్చట తీర్చుకునే కొత్తల్లుళ్ళకు మల్లే తనివి తీరా రావి పళ్ళారగించి కాసేపు ఆడుకొని పాడుకొని ఊసులేవో చెప్పకొని భుక్తాయాసం కాస్త తగ్గాక బృందాలు బృందాలుగా ఎక్కడెక్కడికో ఎగిరి వెళ్ళి పోతుంటాయి.

వస్తుంటాయి;

పోతుంటాయి.

వాలుతుంటాయి.

కుప్పించి ఎగురుతుంటాయి

నందన వనంలోని పువ్వుల్లా, షరాబు దుకాణంలోని ఆభరణాల్లా, శ్రావణ పౌర్ణమినాటి రేయి ఆకాశం లోని మేఘ శకలాలలా-ప్రకృతిలో ఎన్నో అందాలు.

దేని చందం దానిదే!

గోరింక అందం గోరింకదే!

నేరేడు పండులా నిగనిగ లాడుతూ నల్లటి తల. గులాబీ ముల్లులా-వంగి వాడిగా వున్న పసుపు పచ్చటి ముక్కు. కళ్ళ చుట్టూ పసుపు రంగు కాటుక రేఖలు. వక్కరంగు వెల్వెట్ కోటు వీపున వేలాడేసుకున్నట్టు రెక్కలు. బూడిద వన్నె స్కర్ట్ తొడుక్కున్నట్టు పొట్ట. కుచ్చులాంటి తోక విచ్చుకున్నప్పుడు చామరాల్లాంటి రెక్కలు చాచినప్పుడు అందమంతా ఆరబెట్టుకున్నట్టు కనబడే తెలుపు నలుపు చారలు!

ఒకే గోరింకలో వేనకు వేల సొగసులు!

అణువణువునా ఒక్కో అందం!

ప్రతి కదలికలో ఒక కొత్త సోయగం!

మెడ వంచితే ఒక అందం

ముక్కు విసిరితే ఒక అందం

వాలుతుంటే ఒక అందం

ఎగురుతుంటే ఒక అందం

కొమ్మల మీాద వయ్యారంగా నడుస్తూ ఓ గోరింక

కొమ్మ నుండి కొమ్మకు ఎగురుతూ మరొకటి

రెమ్మ నుండి రెమ్మకు గెంతుతూ ఇంకొకటి

కొమ్మకేసి ముక్కు గీరుకుంటూ ఒకటి

ముక్కు విదుల్చుకుంటూ ఒకటి

అల్లరి చేస్తూ ఆకులు దులిపేస్తూ ఒకటి

రావిపళ్ళను పొడిచి తింటూ ఒకటి

పళ్ళను దూసేస్తూ ఒకటి

చిటారు కొమ్మ మీద జిల్లేడు గింజలా ప్రదక్షిణం చేస్తూ ఒకటి

కూచిపూడి భామలా నర్తిస్తూ ఒకటి

పగడాల దండల్లా బరువుతో వంగి వేలాడుతున్న రెమ్మల చివళ్ళను పట్టుకుని ఊగుతూ, ఊత కోసం ఒంటి రెక్కను పటపట కొట్టుకుంటూ ఒకటి

ఊసులాడుకుంటూ కొన్ని-

పాటలు పాడుకుంటూ కొన్ని-

అట్టహాసంగా ఆటలాడుకుంటూ కొన్ని-

మౌనంగా కొన్ని-

పిచ్చెత్తినట్లు కొన్ని-

క్రీచ్ క్రీచ్! కిర్ కిర్ కిర్ కిర్! కిశ్ కిశ్ క్యీర్! క్యో క్యో!

కదలాడే కనుపాపలు కోతి కొమ్మచ్చులాడుతున్నట్టు -గుంపులు గుంపులు!

గుంపులు కావవి, ఇంపులు సొంపులు!

రావిచెట్లో కొలువు దీరిన అతిలోక సౌందర్యం అది!

గోరింకలా అవి? వయ్యారంగా నుంచునే జపాన్ గైషాల చేతుల్లోని వన్నెల విసనకర్రలు!

గోరువంకలు కావవి. అందాల పోటీలో పాల్గొనడానికి వచ్చిన ప్రపంచ సుందరీ మణులు!

గోర్వంకలు కావవి. తమ అంద చందాలతో రూప లావణ్యాలతో జన హృదయాలను రంజింప చేసే చలనచిత్ర తరుణ తారలు!

ఒక గోరింక - అమల

ఒకటేమో - గిరిజ!

మరొకటి? ఇంకొకటి? ఏదేది ఎవరెవరు?

కనక-యమున-శాంతిప్రియ-శోభన-నిరోషా-సీత- రూపా గంగూలీ-జూహీ చావ్లా-మాధురీ దీక్షిత్ మొదలైన వాళ్ళందరూ ఉగాది ఉత్సవానికి తరలి వచ్చి తమ తమ స్థానాలలో హొయలొలుకుతూ కన్నుల విందుగా కూర్చున్నట్టున్న రావిచెట్టు.

గోరువంకలు కానే కావవి. ఉగాది వేడుకలలో పాల్గొని ఎవరి ధోరణిలో వాళ్ళు వీనుల విందుగా తలా రెండు పాటలు పాడి పోదామని వచ్చిన వగరు గొంతుకల తేనె నాలుకల అమర గాయనీ గాయకులు నూర్జహాన్...జూహ్రాబేగం...ఎ.ఎం. రాజా...ఈల పాట రఘురామయ్య...చిత్తూరు నాగయ్య...ముఖేష్...సైగల్...ఎందరెందరో!

వాటిని ఆ గోరింకల్ని కొత్త కొత్త పల్లవులతో మత్తెక్కించే విలక్షణ సినీ కవులని కూడా ఎందుకనుకోరాదు? కొమ్మల మీద సందడి కనీ వినీ ఎరుగని కవి సమ్మేళనమే! చదువుతూ-వేటూరి, సినారె, ఆత్రేయ, దాశరథి, కొసరాజు, సముద్రాల, పింగళి నాగేంద్రరావు, కృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి!

ఈ సమ్మేళనంలో శ్రీశ్రీ ఏడీ? ఎక్కడ గద్దర్?...ఎక్కడ వర్గ భేదాలుంటాయో అక్కడ గళం విప్పి గర్జిస్తారు వాళ్ళు. ఇక్కడ-ఈ గోరింకల వ్యవస్థలో సమతే తప్ప వర్గాలు లేవుకదా! మనుషులకు మల్లే మరొకరి నోటి వద్ద కూడు దోచుకుని దాచుకుని 'తలుపులు మూసుకుని తినే జాతి కాదిది. గోడలూ తలుపులూ గోళ్ళేలూ లేని వసుధైక కుటుంబం ఇది. రేపు అనే దుర్మార్గపు ఊహకు తావు లేకుండా ఏపూటకాపూట ఏది సంప్రాప్తమైతే దాన్ని అందరూ కలిసి పంచుకు తినటమే యిక్కడి నీతి! కనుక ఇక్కడ శ్రీశ్రీ, గద్దర్‌ల అవసరం లేదు. ఇక్కడి కవితలన్నీ భావగీతాలూ, ప్రణయ గీతాలే!

ఈ సాంస్కృతిక సమ్మేళనమంతా తిలకించటానికి రెండు కళ్ళూ చాలవు. తుళ్ళింతలతో ఒళ్ళంతా కళ్ళు చేసుకోవల్సిందే!

ఇలా విసుగూ విరామం లేకుండా ఊసులు చెప్పుకునే ఈ గోరింకల కూతలకు అర్థమేమిటో?

క్యాక్యా-క్యాక్యా...అక్కా బాగున్నావా?

కిర్ కిర్-క్యో...ఎందరమ్మా పిల్లలు నీకు?

కిర్ కిర్-కిర్ కిర్-కీర్...ఓహో ఈ పండెంత తియ్యగా వుందో!

కిచీక్-కిచీక్...అబ్బబ్బ ఎండలు మండిపోతున్నాయ్ కదూ?

క్యూ-క్యూ-క్యూ...ఎంతసేపలా చూస్తాడమ్మా ఆ మేష్టారు? మెడ నొప్పెట్టదూ?

ఒక్కసారి తల అటూ యిటూ తిప్పి పటుక్కున మెడ విరుచుకుని, కిందికి పిల్లల వేపు చూస్తాను.

యథా రాజా తథా ప్రజా!

గురుడెంతో శిష్యులూ అంతే!

తలలు పైకెత్తి నోళ్ళు తెరుచుకున్న గోరింకల్లా కనిపిస్తారు పిల్లలు.

నన్ను ఆవహించిన పారవశ్యమే వాళ్ళది కూడా

వాళ్ళ కళ్ళు చక్రాలై చమక్కున మెరుస్తుంటాయి

గుర్తుపట్టరాని ఓ గోరింక ఆగి ఆగి ''కిశోర్ కిశోర్! కిశోర్ కిశోర్'' అంటూ వుంది.

అప్పుడు కిశోర్ అనే కుర్రాడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వుంటాడు.

రెక్కలు గట్టుకుని ఎగిరి వచ్చిన ఈ చైత్ర విలాసంతోడి వాళ్ళ తాదాత్మ్యాన్ని పెకలించే శక్తి నాకు లేదు. వాళ్ళు పరాకున బడి పాఠం వినటం, చదవటం, రాయటం అన్నీ ఆపేస్తారు. వాళ్ళ కళ్ళూ చెవులూ రావిచెట్టు వశమైపోతాయి. అందుకే ఆ నాలుగైదు రోజులూ పిల్లల్ని కొత్త పాఠాలతో నిర్బంధించను.

వాళ్ళ కళ్ళనిండా ఉల్లాసం. అందులో ఒకింత భయం!

ఆ భయంతోనే అప్పుడప్పుడూ రోడ్డు వేపు చూస్తుంటారు.

ఈ పర్యాయం ఉగాది ప్రమోద శ్రుతి లయల్లో ఓ కొత్త అపశృతి-ఈ భయ విహ్వలతే!

ఇంతలో క్రర్- క్రర్- అంటూ ఓ కొత్త కూత వినిపిస్తుంది.

పిల్లలు అటు కేసి చూస్తారు.

అమ్మో! కాకి! ఒకటి కాదు. పది. నల్లటి రెక్కల్ని చాపుకుని రావిచెట్టు మీదికి వస్తాయి. కింది కొమ్మల్లో కూర్చుంటాయి. అవి కూడా ఒక పండు తిని పది పళ్ళనురాల్చేస్తూ మెల్ల మెల్లగా గోరింకలున్న కొమ్మల మీదికి చేరతాయి.

పిల్లల కళ్ళల్లో మెదిలే భయం కాకుల్ని గురించి కాదు. అసలవి గోరింకల్ని ఏమీ చెయ్యవు. చాలా సాత్వికంగా నడుస్తూ గోరింకలకు మూరెడు దూరంలో వెళ్ళి కూచుంటాయి. గోరింకలు బెదిరిపోవు. దూరంగా తొలగిపోకుండా వున్న చోటనే వుండడం ద్వారా కాకుల పట్ల తమ వినమ్రతను మర్యాదను ప్రకటించి తమ లోకంలో తాము వుండిపోతాయి. అలా ఆ కాకులు ప్రేమ ఒలకబోసి తమ పెద్దరికాన్ని నిలుపుకుని ఎగిరి వెళ్ళిపోతుంటాయి.

వాటి వల్ల గోరింకలకు ఏ చిన్న ప్రమాదం కూడా లేదు.

మరి ఈ పిల్లల కళ్ళల్లో ఆ అనుమానపు నీడలు కదలాడడం దేనికీ?

కారణం వుంది.

అన్నెమూ పున్నెమూ ఎరుగని అమాయకత్వం కూడా దౌష్ట్యానికి బలైపోతుందనడానికి ఈ పిల్లలే ప్రత్యక్ష సాక్షులు.

నిరుటి పండుగ రోజుల్లో కూడా చుట్టుపక్కల పల్లె పట్టుల నుంచి ఓహో అంటూ వచ్చిన గోరింకల గుములతో తేరూ తిరునాళ్ళుగా తయారైంది, విరగపండిన రావిచెట్టు.

పంక్తులు పంక్తులుగా తిని లేచిపోయే మహా సంతర్పణ పండుగ కాక మరేమవుతుంది?

ఏది కృతకమో అది జీవితావసరం కానే కాదు.

ప్రాణి కోటికి ప్రాణమెంత ముఖ్యమో, ప్రాణి సహజమైన నిద్రాహార మైథునాలు అంతే ఆవశ్యకాలు. తక్కినవేవీ యింతకంటే ముఖ్యమైనవి కావు. వీటికి ఎక్కడెక్కడ అభయం లభిస్తుందో అక్కడల్లా పండగే! భద్రత వుండాలే గానీ, బ్రతుకే ఒక పండుగ కదా!

ఓ రో జు యిలాగే రావి చెట్టులో విందులారగించి, ఎండ చురుకెక్కి నీడలు తాబేళ్లకు మల్లే ముడుచుకుంటున్న వేళ జంటలు జంటలుగా కొమ్మల మీద కూర్చున్నాయి గోరింకలు.

కలత లేని వాటి మగత కళ్ళ నిండా ఎన్ని తీపి కలలు కదలాడుతున్నాయో ఏమో? అవి ఏ వెనక

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

జన్మల బాసల్ని నెమరు వేసుకుంటూన్నాయో, ఏమో?

అంతలో గుండె ఝల్లు మనేలా 'ఠపేల్' మన్న చప్పుడు! చెట్టు మీది గోరువంకలన్నీ భయా(కందనలతో కకావికలై ఎగిరిపోతే, గుండెలవిసిన ఆకులూ పళ్ళూ జలజలమంటూ రాలిపోయాయి.

అవి నేల రాలకముందే, దెబ్బ తిన్న ఓ అందాల గోరింక దప్పున పడింది- నీడలో కూర్చున్న పిల్లల ముందర!

పిల్లలు తుళ్ళి పడ్డారు.

ఒక్క ఉదుటున కుర్చీ లోంచి లేచి గోరింక దగ్గర కెళ్ళాను. వొంగి చూశాను. ఓ రెక్క నేల మీదికి చాపి ముద్దలా పడి వున్న గోరింకలో కదలిక లేదు. తెరుచుకుపోయిన నోట నెత్తుటి చారిక. పసుపు రంగు కాటుక రేఖల నడుమ మూసుకుపోయిన కళ్ళు. ముడుచుకుపోయిన కాళ్ళు. పొట్టలో తుపాకీ గాయం. పొట్టలో నుంచి కారిన ఓ చిక్కటి నెత్తుటి బొట్టు- నేల మీద!

ఈ దృశ్యం ఎంతో సేపు లేదు. ఒక్క క్షణం మా(తమే. మరుక్షణంలో నేనుచేయి చాచబోతుండగానే, ఎవడో మనిషి వేగంగా వచ్చి చచ్చిన గోరింకను ఒడిసి పట్టుకుని చరచరా వెళ్ళిపోయాడు.

నెత్తుటి బొట్టును మా(తం వొదిలేసి వెళ్ళిపోయాడు.

మానవుడు భూమికి చేసిన గాయంలా - నేల మీద ఎ(రటి నెత్తుటి బొట్టు!

కన్ను పడినంత మేర కరద్వయాన్ని సాచగల కబంధుడనేవాడు కేవలం పురాణ పా(త మా(తమే కాదు. మనిషికి మూల నామమే ఆ పేరు.

కబంధుడంటే మానవుడే!

రూపంలో- జీవ జాతుల నుంచి మనిషిని వేరు చేస్తున్నది వాడి చేతులే.

అవి పొట్టివి కావు. ఎంతో పొడుగైనవి. భూమిని సైతం చుట్టేయగలిగినవి. ఆ చేతులు ఎంత ఎత్తుకైనా, ఎంత లోతుకైనా, ఎంత దవ్వులకైనా సాగటానికి తోడ్పడే వస్తువుల్ని వాడు సాధనా లంటున్నాడు.

పశు పక్ష్యాదులకు చేతులు లేవు. వుండవలసిన అవసరమూ లేదు. ఎందుకంటే ఈ భూమి పశు పక్ష్యాదులది. అవి చీకూ చింతా లేకుండా హాయిగా బతకటానికి తగిన ఏర్పాట్లన్నీ ఈ భూమి మీద వున్నాయి.

మనిషి కంటే ముందు పుట్టినవి పశు పక్ష్యాదులే! చివర పుట్టిన వాడు మనిషి. మనిషి పుట్టుక వాటిని నిర్మూలించటానికి కాదు; వాటితో సహజీవనం చెయ్యటానికే!

కేవలం చేతులున్నాయన్న ఆధిక్యతా భావంతో పక్షుల నుంచీ, పశువుల నుంచీ అన్యాయంగా వాటి భూమినే లాక్కుంటున్నాడు మనిషి. అంటే, వాటి సుఖ సంతోషాల కోసం ఏర్పడిన పంచ భూతాలనే వాటి నుంచి వేరు చేస్తున్నాడు. వాటికి బతుకే లేకుండా చేస్తున్నాడు.

వాడు రాక్షసుడే! వాడి మాట చెల్లుబాటయ్యే ఈ లోకంలో వాణ్ణే మనిషి అనే అంటున్నారు.

ఆ రోజు మరెన్ని అందాలు నేల రాలాయో ఏమో- దూరాన మరి రెండుసార్లు నాటు తుపాకీ మోత వినిపించింది. పారిపోయిన అందాలన్నీ ఎక్కడ తల దాచుకున్నాయో ఏమో, ఆ రోజు ఒక్క పిట్టయినా మళ్ళీ రావి చెట్టు మీద వాలలేదు.

గుండెను కలుక్కుమనిపించే ఆ చేదు జ్ఞాపకం మనో ఫలకాల నుంచి ఇంకా చెరిగిపోలేదు కనుకనే, పిల్లల ముఖాల్లో ఆ పక్క చూపుల బెదురుపాట్లు!

ఎప్పుడు ఏ ఉరుము ఉరుముతుందో?

ఎప్పుడు ఏ పిడుగు పడుతుందో?

ఎప్పుడు ఏ (పళయం ఫెటిల్లు మంటుందో?

నాలుకతో కోరలు నాక్కుంటూ ఎప్పుడు ఏ తుపాకీ గభిల్లున గర్జిస్తుందో?

నివారించటానికి సమయం చాలనంత వేగంగా వస్తుంది ఆపద, తుపాకీ గుండులా!

ముందుగా పేలేది తుపాకీయే! ఆ తరవాతే గువ్వల వాళ్ళు కనిపించేది!

కర్మకాలి గువ్వల వాళ్ళు గానీ రావటం లేదు కదా అన్నట్లు చూస్తుంటారు పిల్లలు రోడ్డు వేపు.

కాలగమనంలో ఒక్కో కొత్త సంవత్సరానిదీ ఒక్కో తీరు! అభయమిచ్చేది ఒకటైతే, అశాంతిని తెచ్చేది మరొకటి!

గోరింకలకు రోజులు బాగున్నట్టుంది...

ఈసారి ఏ అనర్థమూ వాటి ఛాయలకు రాలేదు.

శారికా సమ్మేళనం జయ(పదంగా ముగిసింది.

రావి చెట్లో పళ్ళన్నీ పూర్తిగా రాలిపోయి, పగడాల రెమ్మలన్నీ వుత్త బరికెలుగా మిగిలాయి.

ముప్పాతికా మువ్వీసం ఆకులు నేలకు దిగి వచ్చి చెత్త కుప్పలైనాయి.

పలచ పలచగా ఇంకా చెట్టును అంటిపెట్టుకున్న ఆ కొన్ని ముదురుటాకులుకూడా రేపో మాపో పండి రాలిపోయేవే!

అయితేనేం? ఆకులు రాల్చుకున్న చెట్టు మళ్ళీ పచ్చగా ముస్తాబు కావటానికి ఎంతో సేపు పట్టదు. వారం రోజుల్లో కొత్త చివుళ్ళు తొడుగుతుంది. నెల తిరిగేసరికి ఆకులతో దట్టంగా బలిసి, చల్లని నీడపట్టు అవుతుంది. ఎండకు మిస మిస లెత్తుతుంది. వానకు పులకరిస్తుంది. చలికి గిలిగింతలు పోతుంది. గాలికి గోల గోలగా నవ్వుతుంది. మళ్ళీ- వచ్చే ఉగాదికి దిశ దిశల గోరింకల్ని సమీకరించి వసంతునికి స్వాగతం పలుకుతుంది.

కానీ, ఇప్పుడు? గాలి గుస గుస తప్ప చెట్టు మీద మరో సవ్వడి లేదు.

పోగులు కట్టి వేలాడే సాలీళ్ళకు మల్లే కనిపిస్తూ - అవసాన దశలో వున్న ఆకుల గిరికీలు, తైతక్కలూ తప్ప, మరే సందడీ లేదు.

మొన్నటి దాకా పెళ్ళివారిల్లులా కిక్కిరిసిపోయిన చెట్టు యిప్పుడు బోసిగా వుంది.

వేసవి సెలవుల్లో పాలోమంటూ వెళ్ళి గోచి పాతలతో కిలారించి దుముకుతూ పొద్దెరుగకుండా ఈతలుకొట్టే స్కూలు పిల్లలతో గోల గోలగా వుండే పెద్ద బావి లాంటి చెట్టు యిప్పుడు నిశ్శబ్దమైపోయింది.

తిరణాల ముగియగానే గుడారాలూ కులాసాలూ మాయమైపోయిన జాతర మైదానం యిప్పుడిది!

దుశ్శాలువలుకప్పకుని కవులు, బిరుదులూ సన్మాన ప(తాలూ అందుకుని గాయనీ గాయకులూ, జ్ఞాపికల బరువుతో ఒయ్యారంగా ఊగిపోతూ పసి మిసల పరువపు తారామణులూ ఆగమేఘాల మీద ఎప్పుడో వెళ్ళిపోయారు.

ఉత్సవ వేదిక వెల వెల బోతున్నది.

పండుగ వెళ్ళిపోయింది, ఎదురు తెన్నులుపరిచి!

ఇప్పుడు చెట్టు మీద గోరింకలు కనిపించటం లేదు.

ఎప్పుడో ఏదో ఓ ఒంటరి పిట్ట ఎగిరి వచ్చి అరుగు మీద నడుం వాల్చే పరదేశిలా కొమ్మ మీద వాలి ఎక్కడో ఏ రెమ్మలోనో ఓ కాయ కనిపిస్తే దాన్ని పొడుచుకుతిని నిమిషం పాటు కూర్చుని ఒకటి రెండుసార్లు (శావ్యంగా కూత వేసి బు(రున వెళ్ళిపోతుంటుంది.

గోరింక కనిపిస్తే బాగుండును కదా అని చెట్టు వేపు చూస్తుంటాను.

నా ఆశ వమ్ము చేయకుండా గంటకో ఘడియకో ఏదో ఒక గోరింక ఒంటరిగా వచ్చి చెట్లో వాలుతుంది.

రెక్కలు విసురుకుంటూ కింది కొమ్మ మీదికి దూకుతుంది.

వంకర గోళ్ళతో కొమ్మను గుచ్చి పట్టుకుని, ఊత కోసం తోక పైకి మడిచి పదిలంగా ముందుకు వంగి, మెడసాచి, బడి ముందర నీడల్లో కూర్చున్న పిల్లల కేసి చూస్తుంది.

లోక (శేయాన్ని ఆకాంక్షించే ఋషి పుంగవుడికి మల్లే ఎలుగెత్తి కంచు మోగినట్లు ఏవో శుభ శకునాలు పలుకుతుంది.

"కిర్‌కిర్ కిర్‌కిర్ - (కీంగ్!"

"కిశ్‌కిశ్ కిశ్‌కిశ్ - (కీంగ్!"

అది ఏమంటోందో?

కిర్‌కిర్ కిర్‌కిర్ (కీంగ్ ... గోరింకలకు శుభమస్తు!

కిశ్‌కిశ్ కిశ్‌కిశ్ (కీంగ్ ... గోరింకలకు (పతీకలైన సాధు జనావళికి అభయోస్తు! ●

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్